స్టాఫ్ నర్సు అభ్యర్థులకు గాలం

- రూ.50 వేలిస్తే ఉద్యోగమంటూ అగంతకుడి ఫోన్
- ఆడియో వైరల్ కావడంతో విచారణకు కలెక్టర్ ఆదేశం

చిత్తూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్టాఫ్ నర్సు ఉద్యోగాలిప్పిస్తామంటూ డబ్బులు డిమాండ్ చేసే ఆడియోలు వైరల్ అవుతున్నాయి. ఈ విషయం ఉన్నతాధికారుల వరకు వెళ్లడంతో విచారణ ప్రారంభించారు.ఈ నెల 3వ తేదీన జిల్లాలో 150స్టాఫ్ నర్సు, 15 ఫార్మసిస్టు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైంది. సుమారు 533 మందితో కూడిన అభ్యర్థుల మెరిట్ జాబితాను వైద్యఆరోగ్యశాఖ అధికారులు తాజాగా విడుదల చేశారు. అందులో అభ్యర్థుల ఫోన్ నెంబర్ సహా అడ్రస్ వివరాలున్నాయి. దీన్ని అదునుగా చేసుకున్న ఒక వ్యక్తి తన పేరు డి.బాలాజీ అంటూ అభ్యర్థులకు ఫోన్ చేసి ఉద్యోగాలిప్పిస్తామంటున్నాడు. 8981491288 నెంబరుతో అభ్యర్థులకు కాల్ చేసిన అతడు 601310110010709 నెంబరుతో ఉన్న బ్యాంకు అకౌంట్ నెంబరు ఇచ్చాడు. ఐఎఫ్ఎస్ కోడ్ ఆధారంగా సెర్చ్ చేయగా, అది ఢిల్లీలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ అని తేలింది. అభ్యర్థులతో మాట్లాడిన ఆడియో నెట్టింట వైరల్ కావడంతో అధికారులు అలర్ట్ అయ్యారు. వెంటనే విచారణ ప్రారంభించారు.

● అతనేం మాట్లాడాడంటే...

'ఎవ్వరికీ చెప్పకుండా నా అకౌంట్‌లో రూ.50 వేలు అడ్వాన్సుగా డబ్బులు వేయండి. ఉద్యోగం మీకే వచ్చేలా నేను మీకు సాయం చేస్తా. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దు' అంటూ తిరుపతిలోని ఒక ఆస్పత్రిలో పని చేసే స్టాఫ్ నర్సుతో మాట్లాడిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దాంతో పాటు రొంపిచెర్లకు చెందిన షాహీనా అనే మరో అభ్యర్థికి వాట్సాప్ కాల్ చేయగా, ఆమె రికార్డు చేసుకోలేకపోయింది. వెంటనే ఆమె సోదరుడు ఆ నెంబర్‌కు కాల్ చేయగా.. 'రూల్స్ ప్రకారం షాహీనాతోనే మాట్లాడాలి. కాన్ఫరెన్సులో మాపై అధికారులు మీ మాటలు వింటున్నారు. మీ అప్లికేషన్ రిజెక్టయ్యే అవకాశముంది. ఆ అమ్మాయి నెంబరు నుంచి ఆ అమ్మాయే మాట్లాడాలి. నా వివరాలు అడగొద్దండి. ఇదంతా సీక్రెట్‌గా చేస్తున్నాం'అంటూ ఆ వ్యక్తి జవాబిచ్చాడు. ఈ రెండు ఆడియో క్లిప్పులు వైరల్ అవుతున్నాయి.

● విచారించి చర్యలు తీసుకుంటాం

స్టాఫ్ నర్సు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు డిమాండ్ చేసిన విషయం నా దృష్టికి వచ్చింది. నిందితుడు డ్రైవర్ అని తెలిసింది. పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటాం. కేసు కూడా నమోదు చేస్తున్నాం.

- కలెక్టర్ సుమిత్‌కుమార్



కుప్పంలోని రెస్కో ప్రధాన కార్యాలయం

రెస్కో సర్వం..... అవినీతిమయం

- తేల్చిన ప్రత్యేకాధికారి విచారణ నివేదిక
- నిజాలు నిగ్గు తేల్చి చర్యలు తీసుకోవాలంటూ సిఫార్సు

కుప్పం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ (రెస్కో) సర్వం అవినీతి మయంగానే ఉందా? గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ సంస్థలో ఇక్కడ అక్రమాలు చోటు చేసుకున్నాయా? సిబ్బంది నియామకాలు, కొనుగోళ్లు, ఆడిట్ రిపోర్టులు, చివరకు మినిట్స్ బుక్కుల్లో కూడా అవకతవకలు జరిగాయా? ఇటువంటి అన్ని ప్రశ్నలకూ అవుననే సమాధానమే లభిస్తోంది. సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మి సుమారు ఆరునెలలపాటు రెస్కో వ్యవహారాలపై విచారణ జరిపి ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ఇక్కడ అవినీతి పక్కా అని తేల్చింది. మరింత లోతైన విచారణ జరిపి, ఆధారాలతో సహా నిజాలను నిగ్గు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ విచారణాధికారి సిఫార్సు చేశారు.విచారణ నివేదిక సివిల్, క్రిమినల్, డిసిప్లనరీ అంశాలకు ప్రాధాన్యమిచ్చింది.సిబ్బంది నియామకాలు, సర్వీసులు, పదోన్నతులు, బడ్జెట్టు వినియోగం, జనరల్ బాడీ సమావేశాలు, విద్యుత్తు పరికరాల కొనుగోళ్లు, జనరల్ బాడీ సమావేశాలు, అక్కడ తీసుకున్న నిర్ణయాలు, జీతభత్యాల పెంపు వంటివి ప్రధానంగా ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి విచారణ పరిధిలోకి వచ్చాయి. వీటన్నింటిపైనా సమగ్రంగా విచారణ జరిపి, నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. వైసీపీ హయాంలో రెస్కోలో ఇద్దరు అధికారులు ఎండీలుగా పదోన్నతులు పొందారు. 115మందిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడానికి కేవలం మూడు రోజుల ముందు 52మంది పదోన్నతి పొందారు. టెండర్లు లేకుండానే విద్యుత్తు పరికరాల కొనుగోళ్లు జరిగాయి. ఖర్చులు తడిసి మోపెడయ్యాయి. వీటన్నింటిపైనా ప్రత్యేకాధికారి విచారణ సాగింది. విచారణ సమయంలో నాలుగైదుసార్లు రెస్కోకు వచ్చిన అధికారి, సిబ్బందిని విచారించడమే కాక, అవసరమైన 30 అంశాలకు సంబంధించిన రికార్డులను ఒక వాహనంలో వేసుకుని మరీ వెంట తీసుకు వెళ్లారు.

● నివేదికలో ఏముంది?

విచారణ నివేదిక నిజానికి సుమారు ఏడెనిమిది రోజులముందే చిత్తూరులోని సహకార శాఖ అధికారులకు చేరింది. వారు ఆ నివేదికను రెస్కో ఎండీ సోమశేఖర్‌కు పంపిస్తూ జనరల్ బాడీ సమావేశంలో ఉంచి, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. కానీ రెస్కో అధికారులు నివేదికను బయట పెట్టలేదు. అయితే ప్రాథమిక విషయాలు బయటకు వచ్చేశాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.... రూ.32.26 లక్షలు దుర్వినియోగమైనట్లు నివేదిక తేల్చింది. నారాయణప్ప అనే ఉద్యోగి సమర్పించిన ఐటీఐ సర్టిఫికెట్ నకిలీదన్న అనుమానాలు వ్యక్తం చేసింది. జనరల్ బాడీ సమావేశాలు జరిపినట్లు, నిర్ణయాలు తీసుకున్నట్లు, వాటిని సమావేశంలోని సభ్యులు అంగీకరించినట్లు మినిట్స్ బుక్‌లో తీసుకున్న సంతకాల కచ్చితత్వంపైనా అనుమానాలున్నాయని అభిప్రాయపడింది. అవసరానికి మించి సిబ్బందిని నియమించుకున్నారని, ఉద్యోగంకోసం, పదోన్నతులకోసం సిబ్బంది, ఎండీ స్థాయి హోదాలు నిర్వహించిన అధికారులు సమర్పించిన సర్టిఫికెట్లు, అనుభవ ధృవీకరణ పత్రాలు సైతం నమ్మదగినవి కావని పేర్కొంది. డిపార్టుమెంట్ ఆడిటర్లను, అప్పట్లో ఇచ్చిన ఆడిట్ రిపోర్టులను కూడా తప్పు పట్టింది. వీటన్నింటిపైనా నిపుణులతో కచ్చితమైన సాంకేతిక పద్ధతుల్లో విచారణ జరిపించి, ఆధారాలు సేకరించి, బాధ్యులపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా సహకార శాఖాధికారులను నివేదికలో ఆదేశించారు. అలాగే రెస్కోలో జరిగిన నియామకాలు, పదోన్నతులు తదితరాలకు సంబంధించి నైపుణ్య పరీక్షల వంటివి నిర్వహించి నిబంధలకు విరుద్ధంగా ఉన్నాయని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరి విచారణ నివేదిక సిఫార్సులు అమలవుతాయో లేదో వేచి చూడాల్సి ఉంది.

రేపట్నుంచి భూముల విలువ పెంపు

- భూములపై 10 శాతం, ఇళ్ల స్థలాలపై 15 శాతం పెంపుదల
- ఏళ్లుగా పెంచని ప్రాంతాల్లో మాత్రమే 20 శాతం



చిత్తూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల విలువలు రేపటి నుంచి పెరగనున్నాయి. ఇందుకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ చార్జీల ధరలూ పెర గనున్నాయి. ఇప్పటికే భూముల విలువలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో 10 శాతం వరకు, విలువ తక్కువగా వున్న ప్రాంతాల్లో 20 శాతం వరకు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా పెరిగిన వివరాలను జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆన్‌లైన్ చేస్తున్నారు. ఫిబ్రవరి 1 నుంచి పెరిగిన ఆస్తులకు అనుగుణంగా కొత్త లెక్కల ప్రకారం రిజిస్ట్రేషన్లు చేయనున్నారు.

● వైసీపీ హయాంలో నాలుగుసార్లు..

వైసీపీ ప్రభుత్వం నాలుగుసార్లు భూముల విలువను పెంచింది. 2020 ఆగస్టులో, 2022 ఫిబ్రవరిలో, ఏప్రిల్‌లో భూముల ధరల్ని పెంచగా, 2024 జూన్ 1 నుంచి కూడా పెంచుతున్నట్లు ఆదేశాలిచ్చింది. 2021లో కరోనా కారణంగా పెంపు జోలికి వెళ్లలేదు. మిగిలిన ప్రతిసారీ 10 నుంచి 40 శాతం వరకు పెంచింది. వైసీపీ ఇష్టానుసారంగా భూముల ధరల్ని పెంచేయడంతో క్రయ విక్రయదారులపై పెనుభారం పడింది. దీనిని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం 10-20 శాతం మధ్యలో పెంపుదలను పరిమితం చేసింది.

● ఎక్కడెక్కడ ఎంత పెరుగుతుందంటే?

పుంగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో 80 రెవెన్యూ గ్రామాలుండగా, నాలుగేళ్లుగా భూముల విలువ పెరగని 65 గ్రామాల్లో 20 శాతం, మిగిలిన 15 గ్రామాల్లో 15 శాతం పెంచుతున్నారు. పలమనేరు కార్యాలయ పరిధిలో 87, బంగారుపాళ్యం పరిధిలో 46, నగరి పరిధిలో 42 రెవెన్యూ గ్రామాలుండగా, అన్ని చోట్లా 15నుంచి 20 శాతం విలువలు పెరగనున్నాయి. చిత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో 10- 20 శాతం మధ్యలో పెంచతున్నారు.

● ఎకరాల్లో లెక్కేసే భూముల విలువల్ని సగటున 15 శాతం పెంచగా.. ఇంటి స్థలాల ధరల్ని 10 శాతం పెంచారు. చాలాకాలంగా పెంచని ప్రాంతాల విలువల్ని మాత్రమే 20 శాతం వరకు పెంచారు.

● కుప్పానికి వెసులుబాటు

కుప్పం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో అత్యధికంగా 221 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఈ కార్యాలయం పరిధిలో విలువ పెంపుదల విషయంలో కాస్త వెసులుబాటు ఇచ్చినట్లు తెలుస్తోంది. సీఎం చంద్రబాబు నియోజకవర్గం కావడం, ఇప్పటికే కొన్ని పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలు కావడం, భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు వచ్చే అవకాశాలు ఉండడం వంటి కారణాలతో ఇక్కడ పెద్దగా భూముల విలువల్ని పెంచడం లేదని తెలుస్తోంది.

● జాతీయ రహదారుల పక్కనున్న భూములకు ఎకరా రూ.7.20 లక్షల నుంచి రూ.8.28 లక్షలకు పెంచనున్నారు. అంటే 15 శాతం విలువ పెరిగింది.

● యాదమరి మండల కేంద్రంలో ఎకరా రూ.4.60 లక్షల నుంచి రూ.5.20 లక్షలకు, చిత్తూరు రూరల్ మండలం దిగువమాసాపల్లెలో ఎకరా రూ.3.33 లక్షలు ఉండగా.. రూ.3.83 లక్షలకు పెంచారు. అంటే ఇక్కడ కూడా 15 శాతానికే పెంచారు.అదే విధంగా చదరపు గజం, చదరపు అడుగుల్లో కొలిచే ఇంటి స్థలాలకు.. ఇప్పటికే ఎక్కువగా విలువ ఉన్నవాటికి 10 శాతమే పెంచారు. చిత్తూరు ప్రకాశం రోడ్డులో చదరపు గజం ధర రూ.46,950 ఉండగా, 10 శాతం అంటే రూ.51,645కు పెంచారు. అలాగే నాయుడు బిల్డింగ్స్‌లో చ.గ ధర రూ.16260 ఉండగా.. 10 శాతం పెంచి రూ.17900 చేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు ముమ్మరం

పురుగుమందుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

చిత్తూరు సెంట్రల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయ శాఖ తనిఖీలు ముమ్మరం చేసింది. రెండ్రోజులుగా అధికారులు తనిఖీలు చేస్తున్నారు.ఇందుకోసం ఏడీతో కూడిన నాలుగు ప్రత్యేక బృందాలను జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ రంగంలోకి దించారు. జిల్లాలో 230 ఎరువులు, పురుగు మందుల దుకాణాలున్నాయి. వీటిలో ఇప్పటి వరకు 61 దుకాణాలు తనిఖీ చేశారు. దుకాణాల్లో ఉన్న స్టాక్, రికార్డుల్లోని స్టాక్, గడువు దాటిని మందులు ఇలా అన్ని కోణాల్లోనూ పరిశీలన చేస్తున్నారు. విక్రయానికి ఎలాంటి అనుమతుల్లేని రూ.58వేల విలువైన మందులను సీజ్ చేశారు. రైతులకు ఎలాంటి నష్టం కల్గించేలా ఎరువులు, పురుగుమందులు విక్రయించినా ఆయా దుకాణాలపై చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ జేడీ హెచ్చరించారు.

టెన్త్ పరీక్షల పరిశీలకుడి నియామకం

చిత్తూరు సెంట్రల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మార్చిలో జరగనున్న టెన్త్ పరీక్షల పరిశీలకుడిగా ఆర్.నరసింహారావును నియమిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఓపెన్ స్కూల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈయన గతంలో చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారిగా కూడా పనిచేశారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు 'వంద'నం



రాకెట్ నమూనాలో కొందరు.. 100 అంకె ఆకృతిలో మరికొందరు. ఇలా విద్యార్థులు కూర్చుని ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. షార్ నుంచి బుధవారం వందో రాకెట్ ప్రయోగం విజయవంతమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం గూడూరులోని గాయత్రి ఇంగ్లీషుమీడియం పాఠశాలలో విద్యార్థులు రాకెట్ నమూనాలో మానవహారాన్ని ఏర్పాటు చేసి శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, శ్రీహరి, సోనియా, రఫీ, రాఘవయ్య, సుప్రజ, మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి


ట్రయల్ రన్



రథసప్తమి సందర్భంగా తిరుమలలో ఫిబ్రవరి 4న ఉదయం నుంచి రాత్రి వరకు ఏడు వాహనాలపై మలయప్ప మాడవీధుల్లో ఊరేగనున్నారు. ఈక్రమంలో భారీ పరిమాణంలో కలిగిన సర్వభూపాల, సూర్యప్రభ వాహనాల పటిష్ఠతను పరిశీలించేందుకు టీటీడీ అధికారులు గురువారం ఉదయం ట్రయల్ రన్ నిర్వహించారు. అధిక బరువుండే ఈ వాహనాల ఊరేగింపులో వాహన బేరర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలించారు. వాహన మండపం నుంచి ఆలయం వరకు.. అక్కడ్నుంచి తిరిగి వాహనమండపం వరకు ఈ ట్రయల్ రన్ నిర్వహించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 7 గంటలు



తిరుమలలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.14 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 62,710

తలనీలాలు సమర్పించినవారు : 15,635



తిరుపతి కపిలతీర్థం వద్ద టాస్క్‌ఫోర్సు ఆఫీసు ఆవరణలో శిథిలమవుతున్న వాహనాలు

వామ్మో... ఇవన్నీ పుష్పా కార్లు

- ఎర్రచందనం స్మగ్లింగ్‌లో పట్టుబడి తుక్కుగా మారుతున్న వాహనాలు
- దర్యాప్తులో జాప్యంతో రూ.కోట్ల నష్టం

తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఈ కార్లు వేలం వేస్తామహో...! అని తిరుపతి డివిజన్ అటవీశాఖ ప్రకటించింది. ఇండియాలో షోరూములున్న అన్ని కార్లూ కపిలతీర్థం దగ్గరున్న టాస్క్‌ఫోర్స్ ఆఫీసు ఆవరణలోని తుప్పల్లో ఇలా ఉన్నాయి. కోరిన మోడల్.. కారు చవగ్గా వేలంలో ఎగరేసుకుపోవచ్చని ఆశ పడితే మాత్రం హుళుక్కే! వీటిలో ఇంజన్లు ఉన్నాయో లేదో తెలీదు. ఉన్నా ఏ పార్టులు మిగిలివున్నాయో చెప్పలేం. విత్తనాలు పడి, మొక్కలు మొలిచి, మానులై పెరిగి, తీగలు అల్లుకుని ఇదిగో ఇలా ఉన్న ఈ కార్లను కొని రోడ్ల మీద తిప్పడం సాధ్యమేనా? తుక్కుకు తప్ప పనికిరాని తుప్పుగా మారిన ఈ కార్లను కొనే సాహసం పాత సామాన్లు కొనేవారు తప్ప ఇంకెవరూ చేయడం లేదు. అందుకే 2024 సెప్టెంబర్‌లో 40 వాహనాలను వేలం వేయగా కేవలం రూ.18.59లక్షలు మాత్రమే వచ్చింది. ఫిబ్రవరి 5న 153 వాహనాలు వేలం వేసేందుకు అటవీ శాఖ సిద్ధపడింది. ఇంకా 800కు పైగా వాహనాలు కనీసం తుక్కుగా కూడా పనికిరాని విధంగా పడివుంటాయన్నమాట.

ఎందుకిలా?

దర్యాప్తులో అసాధారణ జాప్యం వల్ల ఎర్రచందనం స్మగ్లింగ్‌లో పట్టుబడ్డ వాహనాలు ఇలా పనికిరానివిగా మిగిలిపోతున్నాయి. పట్టుబడ్డ వాహనాల యజమానులను గుర్తించడమే పెద్ద సమస్య. స్మగ్లింగ్‌కి వాడే వాహనాలకు సాధారణంగా అసలు నెంబర్లు ఉండవు. చాసిస్ నెంబర్లను కూడా మార్చేస్తుంటారు. దీంతో వీటి అసలు యజమానులు ఎవరో తేలలేదు అని నిర్ధారించేసరికే ఏళ్లకు ఏళ్లు పడుతోంది. అప్పటికే ఇవి మట్టిలో కూరుకుపోయి, చెట్ల మధ్య మునిగిపోయి ఇలా మారుతున్నాయి. ఆ తర్వాత వీటి వేలాని అనుమతి పొంది, విలువ కట్టాల్సిందిగా ఆర్టీవో కార్యాలయాన్ని కోరుతారు. వారు ధరలు నిర్ణయించాక వేలం ప్రకటిస్తారు. తీరా వేలం వేసే నాటికి ఇనుముగా తప్ప ఇంక దేనికీ పనికిరాకుండా పోతున్నాయి. ఇట్లా లారీలు, వ్యాన్‌లు, ఆటోలు, కార్లు కుప్పలు తెప్పలుగా పడివుంటున్నాయి. భాకరాపేట ఘాట్‌లో అయితే ఈ వాహనాలను మట్టిలో కలిపేస్తూ ఒక అడవే పెరిగింది.

రూ.30 కోట్ల ఆదాయం మటాష్!

దర్యాప్తులో వేగం పెంచి, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో వ్యవహరిస్తే పట్టుబడిని ఏడాదిలోనే ఈ వాహనాలను వేలం వేసే అవకాశం ఉంటుంది. ఇలా చేయగలిగితే ప్రభుత్వానికి భారీ ఆదాయం కూడా లభిస్తుంది. తిరుపతి డివిజన్ పరిధిలో 2000 నుంచి గతేడాది చివరి వరకూ స్వాధీనం చేసుకున్నవే వెయ్యి వాహనాలదాకా ఉన్నాయి. పట్టుబడిన ఏడాదిలోగా వేలం వేయగలిగితే సగటున ఒక వాహనం రెండు నుంచి మూడు లక్షలకు అమ్ముడయ్యే అవకాశం ఉంటుంది. అంటే దాదాపు 20 నుంచి 30 కోట్ల రూపాయల ఆదాయం లభించేది.



భాకరాపేట ఘాట్ పక్కన తుక్కుగా మారిన వాహనాలు

దర్యాప్తు తుప్పు వదిలితే కోట్ల ఆదాయం

- స్వాధీనం చేసుకున్న వాహనాలను ఎక్కడపడితే అక్కడ కాక భద్రతగల ప్రత్యేక ప్రాంతాల్లో పార్క్ చేయాలి.
- పట్టుబడిన వాహనాల ప్రతి పార్ట్‌నూ వీడియో రికార్డు చేయచ్చు.
- అసలు యజమానులను గుర్తించే ప్రక్రియకు ఏడాదికి మించకుండా గడువు
- చార్జ్‌షీట్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి.
- ప్రత్యేక కోర్టుల ద్వారా కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలి.



చేతివాటమూ ఘనమే

పట్టుబడిన వాహనాల్లోంచి ముఖ్య భాగాలు మాయమైపోతుంటాయి.ముందుగా మాయమ య్యేది బ్యాటరీలు. వాటి స్థానంలో పనికిరాని బ్యాటరీలు ప్రత్యక్షమవుతాయి. కొన్ని వాహనా లకైతే ఏకంగా ఇంజన్లే మాయమైపోతుం టాయి. మానిటర్లూ, జీపీఎస్‌లూ వంటివి అయితే అసలు మిగలవు. ఎలాగూ ఇప్పట్లో తేలే వ్యవహారం కాదు కాబట్టి ఇంటి దొంగలే చేతివాటం ప్రదర్శిస్తుంటారని తెలుస్తోంది.

5న 153 వాహనాల వేలం

తిరుపతి డివిజన్ పరిధిలో పట్టుబడిన 153 వాహనాలను ఫిబ్రవరి 5న తేదీన కపిలతీర్థం వద్ద జిల్లా అటవీ అటవీ శాఖ కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నారు. ఆ తర్వాత మరో 200 వాహనాలకు కూడా బహిరంగ వేలం వేయనున్నట్లు సమాచారం.



ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



తిరుమల, జనవరి30 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్టుకు గురువారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. తిరుపతికి చెందిన బ్లిస్ హోటల్స్ గ్రూప్ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి దంపతులు విరాళం చెక్‌ను అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈకార్యక్రమంలో బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి కూడా ఉన్నారు.

శ్రీకాళహస్తి రూరల్ సీఐ వాహనం బోల్తా

- సీఐతో పాటు డ్రైవర్‌కు తీవ్రగాయాలు



తిరుపతి(నేరవిభాగం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఉప్పరపల్లి సమీపంలో శ్రీకాళహస్తి రూరల్ సీఐ వాహనం గురువారం రోడ్డుకు ఎడమ వైపున బోల్తా పడింది. రోడ్డుపై వస్తున్న ఆవులను తప్పించబోయే క్రమంలో అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. సీఐతో పాటు డ్రైవర్‌కూ తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఎస్పీ కార్యాలయంలో అధికారిక పనుల నిమిత్తం శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్, సిబ్బంది గురువారం ఉదయం తిరుపతికి వచ్చారు. ఇక్కడ పనులు ముగించుకుని తిరిగి వెళుతుండగా ఒక్కసారిగా ఆవులు రోడ్డుపైకి పరుగెత్తుకుంటూ వచ్చాయి. ఈ ఆవులను తప్పించబోయే క్రమంలో వాహనం రోడ్డుకు ఎడమవైపున పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. వాహనంలోని రూరల్ సీఐ రవినాయక్‌తో పాటు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

నేడు పెళ్లి జరగాల్సి ఉండగా..!

- పది రోజుల కిందట అదృశ్యమైన విద్యార్థిని
- పంబలేరువాగులో లభ్యమైన మృతదేహం

గూడూరు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అంతా అనుకున్నట్లు జరిగుంటే.. ఆ ఇంట పెళ్లి బాజాలు మోగాల్సింది. శుక్రవారం ఉదయం ఆమె పెళ్లి కూతురుగా పీటలమీదకు ఎక్కాల్సి ఉంది. కానీ.. ఆ ఇంట విషాదం నెలకొంది. పది రోజుల కిందట అదృశ్యమైన ఆ విద్యార్థిని.. పంబలేరు వాగులో గురువారం మృతదేహంగా తేలింది. ఈ విషాద ఘటన గూడూరు మండలం పోటుపాళెం సమీపంలో చోటుచేసుకుంది. గూడూరు రూరల్ పోలీసులు తెలిపిన ప్రకారం.. సూళ్లూరుపేటలోని రాఘవయ్యపేటకు చెందిన శామ్యూల్ జయకుమార్, రమాదేవి దంపతుల కుమార్తె లేహానిస్సి(19) గూడూరులోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ రెండో సంవత్సరం చదువుతోంది. ఈమెకు సమీప బంధువుతో ఈ నెల 31వ తేదీ (శుక్రవారం) పెళ్లి నిశ్చయించారు. ఈ క్రమంలో ఈనెల 20వ తేదీన కళాశాలకు వెళ్లిన లేహానిస్సి ఇంటికి రాలేదు. పలుచోట్ల వెదికిన కుటుంబసభ్యులు.. ఆమె కనిపించడం లేదని ఈనెల 21న సూళ్లూరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గూడూరు మండలం పోటుపాళెం సమీపంలోని పంబలేరువాగులో గురువారం లేహానిస్సి మృతదేహం లభ్యమైంది. శుక్రవారం ఉదయం పెళ్లి జరగాల్సి ఉండగా ఆమె మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విద్యార్థిని మృతికి గల కారణాలను పోలీసులు విచారిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించి రూరల్ ఇన్‌చార్జి ఎస్‌ఐ తిరుపతయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లేహానిస్సి (ఫైల్ ఫొటో)

పూడుపాముల రవాణా కేసులో ముగ్గురికి ఏడాది జైలు శిక్ష

- 15 ఏళ్లనాటి కేసులో తీర్పు

సత్యవేడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పూడుపాముల అక్రమ రవాణా కేసులో ముగ్గురు నిందితులకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలిలా ఉన్నాయి. 2009 జూలై 22వ తేదీన సత్యవేడు మండలం పేరడం గ్రామానికి చెందిన మేకల లక్ష్మయ్య, తమిళనాడు రాష్ట్రం ఊత్తుకోట్టైకు చెందిన రజిని, రాధ.. సత్యవేడు అటవీప్రాంతం నుంచి నాలుగు పూడు పాములు పట్టుకుని అక్రమ రవాణా చేస్తుండగా అప్పటి ఎస్‌ఐ బీవీ శ్రీనివాసులు పట్టుకున్నారు. పాముల సహా వీరిని అటవీశాఖకు అప్పగించారు. 2022లో అప్పటి ఎఫ్‌ఆర్‌వో జయప్రసాదరావు అటవీ హక్కులు, వన్యప్రాణి విభాగం చట్టం ప్రకారం చార్జిషీటు దాఖలు చేయగా, ఎఫ్‌బీవో వేణుగోపాల్ ఇందుకు సంబంధించిన సాక్షులను ప్రవేశ పెట్టారు. నేరం నిరూపణ కావడంతో ముగ్గురు నిందితులకు ఏడాది జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ ఇన్‌చార్జి న్యాయమూర్తి గోపాలకృష్ణ తీర్పును వెలువరించారు.

ఇద్దరు 'ఎర్ర' దొంగలకు ఐదేళ్ల జైలు

- రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ ఎర్రచందనం అదనపు జిల్లా జడ్జి నరసింహమూర్తి గురువారం తీర్పు చెప్పారు. దీనికి సంబంధించి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. ఎనిమిదేళ్ల క్రితం తమిళనాడుకు చెందిన కె.మణి, పి.దొరస్వామి ఎర్రచందనం అక్రమంగా తరలిస్తూ నాగపట్ల బీట్ పరిధిలోని చామల రేంజ్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. దీనిపై విచారించి కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. దీంతో ప్రస్తుతం ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎస్పీ శ్రీనివాస్ కేసులో ఎప్పటికప్పుడు ప్రగతి నివేదికలపై సమీక్షిస్తూ సూచనలు జారీ చేశారు. సాక్ష్యాధారాలు కోర్టుకు హాజరుపరచడం మొదలు నిందితులకు జైలు శిక్ష పడేలా విశేష కృషి చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. దీంతో పోలీసు బందోబస్తు మధ్య నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

ఎల్‌ఎల్‌బీ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో గతేడాది ఆగస్టు-సెప్టెంబరు నెలల్లో నిర్వహించిన సీబీసీఎస్, నాన్ సీబీసీఎస్ ఎల్‌ఎల్‌బీ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ నాల్గవ సెమిస్టర్, ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ నాలుగు, ఎనిమిది సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేశారు. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఫలితాలు పొందుపర్చినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

ఎస్వీయూ దూరవిద్యా పరీక్షలు వాయిదా

- ఉత్తర్వులు జారీ చేసిన వీసీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఫిబ్రవరి 3వ తేదీ నుంచి నిర్వహించాల్సిన దూరవిద్యా పరీక్షలు వాయిదా వేసినట్లు వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

రేపు ఇంటింటా పింఛన్ల పంపిణీ

- లబ్ధి పొందనున్న 2,63,191మంది

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫిబ్రవరి నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను శనివారం ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. పింఛన్ల పంపిణీపై జిల్లా అధికారులతో ఆయన గురువారం టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. శుక్రవారం బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకుని శనివారం ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేయాలన్నారు. 2వ తేదీ ఆదివారం కావడంతో మిగిలిన వారికి 3వ తేదీ పంపిణీ చేయాలని ఆదేశించారు.జిల్లాలోని 691సచివాలయాల పరిధిలో 2,63,191 మందికి ప్రభుత్వం రూ.112.19 కోట్లు మంజూరు చేసిందన్నారు.

ప్రాణదాన పథకానికి 194 మంది ఎంపిక



ప్రాణదాన కమిటీలో రోగులను ఎంపిక చేస్తున్న కమిటీ సభ్యులు

తిరుపతి(వైద్యం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో పేద రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు టీటీడీ నిర్వహిస్తున్న ప్రాణదాన పథకానికి 194 మందిని ఎంపిక చేశారు. స్విమ్స్‌లో గురువారం డైరెక్టర్ ఆర్వీకుమార్ ఆధ్వర్యంలో ప్రాణదాన కమిటీ సమావేశం నిర్వహించారు. ఆర్థిక స్థోమత లేని అర్హులైన నిరుపేద రోగులను వైద్య విభాగాల వారీగా ఉచిత శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. కార్డియోథొరాసిక్ 18, ఎండోక్రైనాలజీ 1, జనరల్ సర్జరీ 3, మెడికల్ ఆంకాలజీ 2, మెడిసిన్ 21, నెఫ్రాలజీ 55, న్యూరాలజీ 36, న్యూరో సర్జరీ 19, గైనకాలజీ 2, రేడియేషన్ ఆంకాలజీ 5, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ 29, సర్జికల్ ఆంకాలజీ 2, యూరాలజీ 1 చొప్పున ఎంపిక చేశారు. ప్రాణదాన పథకానికి దాతలు అండగా నిలవాలని డైరెక్టర్ ఆర్వీకుమార్ కోరారు.

శ్రీవారి సేవలో కేంద్రమంత్రి కుమారస్వామి

తిరుమల, జనవరి30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలో జరిగిన తోమాల సేవలో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని రాక

- తిరుపతిలో కూటమి పార్టీల నేతలతో సమావేశం
- రేపు శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

తిరుపతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ శుక్రవారం తిరుపతికి రానున్నారు. గురువారం కలెక్టరేట్‌కు అందిన సమాచారం ప్రకారం.. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు తిరుపతి చేరుకుని తిరుచానూరు రోడ్డులోని ఓ హోటల్‌లో బస చేస్తారు. అక్కడ జిల్లా ఎమ్మెల్యేలు, కూటమి పార్టీల నేతలతో సమావేశమవుతారు. ఖాళీగా ఉన్న తిరుపతి డిప్యూటీ మేయర్ పదవికి ఫిబ్రవరి 3న ఎన్నిక జరగనున్న నేపథ్యంలో దీనిపై కూటమి పార్టీల నేతలతో చర్చించే అవకాశముంది. శనివారం ఉదయం శ్రీకాళహస్తి చేరుకుని పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఆలయ ఈవో బాపిరెడ్డి తదితరులతో సమావేశమై సమీక్షించనున్నారు.

సబ్ జైళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో జిల్లా అధికారులు ఆ మేరకు పనులకు సిద్ధమయ్యారు. తిరుపతి, సత్యవేడు, శ్రీకాళహస్తి సబ్ జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. తిరుపతిలో 10 నుంచి 12, సత్యవేడులో 10, శ్రీకాళహస్తిలో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

● రూ.19.42 లక్షల సొత్తు స్వాధీనం : డీఎస్పీ



మీడియాకు వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ సాయినాథ్

చిత్తూరు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు దొంగలను అరెస్టు చేసి.. రూ.19.42 లక్షల సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒకటో పట్టణ స్టేషన్ ఆవరణలో సీఐ జయరామయ్య, సీసీఎస్ సీఐ ఉమామహేశ్వరరావులతో కలిసి డీఎస్పీ సాయినాథ్ గురువారం మీడియాకు వివరాలు తెలిపారు. వారం రోజుల కిందట చిత్తూరు నగరం దొడ్డిపల్లెలో నివాసం ఉంటున్న సెల్వరాజ్ ఇంటి తాళం పగులగొట్టి నగదు, బంగారం, వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ మణికంఠ ఆదేశాలతో ఒకటో పట్టణ, సీసీఎస్ సీఐలు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. రైల్వే కోడూరుకు చెందిన మణికంఠ, ఏలూరుకు చెందిన మొహీద్దీన్ ఆలీలు దొంగతనం చేసినట్లు గుర్తించారు. వీరిని తమిళనాడు రాష్ట్రం కాట్పాడి సమీపంలోని కింగ్‌స్టన్ కాలేజీ వద్ద అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 238.5 గ్రాముల బంగారం, 65 గ్రాముల వెండి ఆభరణాలు (విలువ రూ.14.36 లక్షలు), రూ.4.06 లక్షలు, మూడు సెల్‌ఫోన్లు, వాచ్‌విలువ రూ.లక్షతో కలిపి మొత్తం రూ.19.42 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు ఛేదనకు కృషి చేసిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

మోడల్ స్కూల్ పేరుతో విలీనం వద్దు : ఎస్టీయూ

చిత్తూరు సెంట్రల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ పేరుతో పాఠశాలల విలీన ప్రక్రియ చేయరాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్, మోహన్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం చేస్తున్న 117 జీవో సవరణ ప్రక్రియ.. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన అంశాలకు భిన్నంగా చేస్తున్నదన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను రద్దు చేసేలా నిబంధనలు రూపొందించడం సరికాదని పేర్కొన్నారు. దీనిద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులు నష్టపోతారని తెలిపారు.

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

● రథసప్తమి ఏర్పాట్లే ప్రధాన అజెండా


తిరుమల, జనవరి30(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి శుక్రవారం సమావేశం కానుంది. అన్నమయ్య భవనంలో టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశంలో ప్రధానంగా రథసప్తమి ఏర్పాట్లపైనే చర్చించనున్నారు. తిరుపతి తొక్కిసలాట ఘటన నేపథ్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా తీసుకోవల్సిన జాగ్రత్తలు, దర్శన విధానాలు, మాడవీధుల గ్యాలరీల్లోకి భక్తుల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, ప్రధాన సౌకర్యాలపై చర్చించనున్నారు. ఫిబ్రవరి 4న జరిగే రథసప్తమికి దాదాపు 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా.

అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు మహ్మద్ యూసఫ్ బాషా



యూసఫ్ - పరశురాముడు

కుప్పం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ క్రీడాకారుడు మహ్మద్ యూసఫ్ బాషా, టెక్నికల్ అఫిషియల్‌గా కర్నూలు జిల్లాకు చెందిన పరశురాముడు ఎంపికైనట్లు చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ మహేశ్, కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. యూసఫ్ మదనపల్లెకు చెందినవారు కాగా, పరశురాముడు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఆయన షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఉన్నట్లు తెలిపారు. గతేడాది నిర్వహించిన మొదటి వరల్డ్ కప్ షూటింగ్ బాల్ పోటీలకు భారత జట్టు మేనేజరుగా వ్యవహరించినట్లు చెప్పారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన ఇద్దరికీ అసోసియేషన్ సభ్యులు పవన్ కళ్యాణ్, సెల్వం, వివేక్, లోకనాథం, స్వాతి, జబీర్, సురేశ్ అభినందనలు తెలిపారు.



చిరుత సంధ్యావందనం

తిరుమల శిలాతోరణం వద్ద గుట్టమీద గురువారం సాయంత్రం ఓ చిరుతపులి కాసేపు అస్తమిస్తున్న సూర్యుడిని చూస్తూ నింపాదిగా కూర్చుంది. లేచి ఒళ్లు విరుచుకుని కొండ దిగి వెళ్లిపోయింది. ఈ దృశ్యాన్ని యాత్రికులు తమ మొబైల్ కెమెరాల్లో చిత్రించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఉపాధి హామీలో అక్రమాలకు చెక్...!

● ఫిబ్రవరి నుంచి నూతన పద్ధతులు అమల్లోకి
● కొత్తగా మేటి, శ్రమశక్తి సంఘాల ఏర్పాటు
● రోజువారి కూలీ పెరిగే అవకాశం



చిత్తూరు సెంట్రల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకున్న అక్రమాలకు చెక్ పెట్టే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.శ్రమశక్తి సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.అధికార యంత్రాంగాన్ని కాకుండా ఈ సంఘాల్లో ఉత్సాహంగా పనిచేసే కూలీలను మేటీలుగా నియమించనుంది. గతంలో సంఘాల ద్వారా ఉపాధి సిబ్బంది క్షేత్ర స్థాయిలో కూలీలచే పని చేయించేవారు. తమ ఉద్యోగాలను కాపాడుకునేందుకు, క్షేత్రస్థాయిలో పనులు జరగకపోయినా, రికార్డుల్లో మాత్రం కూలీలు పనికి వచ్చి చేసినట్లు నమోదు చేసేవారు. ఈ అక్రమాలు సామాజిక తనిఖీ చేసినప్పుడు కానీ వెలుగులోకి వచ్చేవి కావు.ఈ లోపాలకు స్వస్తి పలికేలా ప్రభుత్వం ఫిబ్రవరి నెల నుంచి కొత్త విధానాలు అమలు చేయనుంది. ఉపాధిలో మేటీలతో పాటు శ్రమశక్తి సంఘాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటు లాంటి సంస్కరణలను చేపట్టనుంది.

● రూ.300 వరకు పెరగనున్న కూలి

ప్రస్తుతం జిల్లాలో రోజువారి కూలీ రూ.259 ఉంది. ఈ మొత్తాన్ని రూ.మూడు వందలకు పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై అధికారులు కసరత్తు పూర్తి చేశారు. వేతనం పెంచి కూలీల సంఖ్య పెరిగేలా జిల్లాస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 2.68 లక్షల జాబ్ కార్డులుండగా, 4.80 లక్షల మంది కూలీలు ఉన్నారు. పనివేళలు సక్రమంగా నిర్వహించడం, శ్రమశక్తి సంఘాల్లోని వేతనదారులకు, క్షేత్రస్థాయి సహాయకులు, సాంకేతిక సహాయకుల మధ్య సమన్వయం కుదిర్చేలా చర్యలు చేపడుతారు.

● ఫ్లయింగ్ స్క్వాడ్ల ఏర్పాటుకు సన్నాహాలు

ఉపాధి హామీ పనుల పర్యవేక్షణకు జిల్లాస్థాయిలో ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. స్క్వాడ్ బృందంలో ఆరుగురి నుంచి ఏడుగురి దాకా టెక్నికల్ అసిస్టెంట్లు ఉంటారు. విజిలెన్స్ అధికారితో పాటు క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఉంటారు. వీరందరినీ ఉపాధి హామీ పథకం నుంచి ఎంపిక చేస్తారు.

●మేటీ పనితీరు ఇలా..

ప్రతి సంఘంలో ఉత్సాహంగా ఉన్న కూలీని మేటిగా ఎంపిక చేస్తారు.వీరికి క్షేత్ర, సాంకేతిక సహాయకులు పని చూపెడతారు. చేసిన పనికి వీరి ద్వారా కొలతలు వేయిస్తారు. కూలీల పర్యవేక్షణను మేటిద్వారా నిర్వహిస్తారు. కూలీలతో కలిసి ఇతనూ పనిచేస్తాడు. మొత్తం పని పర్యవేక్షణను క్షేత్రస్థాయి సహాయకుడు, సాంకేతిక సహాయకులు చూస్తారు. గతంలో పర్యవేక్షణంతా క్షేత్ర సహాయకుడే చేసేవారు.ప్రస్తుతం కూలీల్లోనే మేటీని ఎంపిక చేస్తారు. నూతన పద్ధతిలో రెండు విడతల్లో పర్యవేక్షణ ఉండనుంది. శ్రమశక్తి సంఘంలో 20 మంది సభ్యులు ఉంటారు. ఇలా మండలానికి 500కుపైగా శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు కానున్నాయి.

జిల్లా	: చిత్తూరు
మండలాలు	: 31
గ్రామ పంచాయతీలు	: 700
మొత్తం జాబ్ కార్డులు	: 2.68 లక్షలు
మనుగడలోని జాబ్ కార్డులు	: 2.16 లక్షలు
మొత్తం కూలీలు	: 4.8 లక్షలు
క్రియా శీలక కూలీలు	: 3.16 లక్షలు
రోజు వారి గిట్టుబాటు కూలీ	: రూ.259

అక్రమాలకు పాల్పడలేదని ప్రమాణం చేస్తారా?

● పెద్దిరెడ్డికి ఎమ్మెల్యేలు నాని, మురళీ ప్రశ్న



మీడియా సమావేశంలో సీఆర్ రాజన్, పులివర్తి నాని, మురళీ మోహన్

చిత్తూరు సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూములను ఆక్రమించారని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీ మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ఆరోపించారు. పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై విచారణ కమిటీ వేశామని, ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేశారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పెద్దిరెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న పుంగనూరు నియోజకవర్గంలోని పులిచెర్ల మండలం మంగళంపేట రెవెన్యూ పరిధిలోని అటవీ భూములను నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించారని చెప్పారు. గత వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. అటవీ భూముల్లో విలాసవంతమైన భవనాలు నిర్మించుకుని అనుభవించడం వైసీపీ నేతలకే చెల్లించదని మండిపడ్డారు. పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులపై ఉన్న 75 ఎకరాలకు సంబంధించిన భూముల వివరాలను ప్రజలకు చెప్పి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆ భూములు తమవే అయితే ఎన్నికల అఫిడవిట్‌లో ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. భూకబ్జాలు, దౌర్జన్యాలు, అన్యాయాలు, అక్రమాలు చేయలేదని కాణిపాక వినాయక స్వామి సన్నిధిలో ప్రమాణం చేయడానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. పెద్దిరెడ్డి అక్రమాలకు పాల్పడడమే కాకుండా సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అవాకులు చెవాకులు మాట్లాడటం మానుకోవాలని హెచ్చరించారు. పెద్దిరెడ్డి తీరు మార్చుకోకుంటే జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ ఏకమై తగిన బుద్ధి చెబుతామన్నారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, 'చుడా' చైర్‌పర్సన్ కటారి హేమలత, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ, నేతలు మేషాక్, మహేంద్ర గౌడ్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డీ..... నిజాయితీ నిరూపించుకో

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పలమనేరు, జనవరి30 (ఆంధ్రజ్యోతి) : అటవీశాఖ భూములను ఆక్రమించినట్లు వచ్చిన ఆరోపణలకు సంబంధించి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన నిజాయితీని నిరూపించుకోవాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు.పలమనేరులో గురువారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ హయాంలో పెద్దిరెడ్డి ప్రాతినిధ్యం వహించిన అటవీ, మైనింగ్, విద్యుత్ శాఖల్లో వేల కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని, దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని అమరనాథరెడ్డి డిమాండు చేశారు.మదనపల్లె ఆర్డీవో ఆఫీసులో ఫైళ్ల దహనం కేసులో తన తప్పు లేకపోతే ముందస్తు బెయిల్ ఎందుకు తెచ్చుకున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా పెద్దిరెడ్డి తనపై వచ్చిన అభియోగాలకు సంబంధించి నిజాయితీని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

జగన్‌కు తీసిపోని పెద్దిరెడ్డి అక్రమ సామ్రాజ్యం

●ఎమ్మెల్యే భానుప్రకాష్



పుత్తూరు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):జగన్‌కు ఏమాత్రం తీసిపోకుండా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమ సామ్రాజ్యం విస్తరించారని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తూర్పారబట్టారు. గురువారం పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై ఆయనో వీడియో విడుదల చేశారు. అటవీశాఖ భూ ఆక్రమణలు నిజమని తేలితే పెద్దిరెడ్డితో పాటు ఆయన తనయుడు మిథున్‌రెడ్డి తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఆక్రమించిన భూములను, అక్రమ సంపాదనను స్వచ్ఛందంగా ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలన్నారు. మదనపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఫైల్స్ తగలబడిన ఘటనలో తనకు సంబంధం లేదన్న పెద్దిరెడ్డి మందస్తు బెయిల్ తెచ్చుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. 75 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించుకోవడమే కాకుండా దర్జాగా అడవిలోకి రోడ్డు వేసుకుని విలాసవంతమైన గెస్ట్ హౌస్ కట్టుకున్నాడని విమర్శించారు. అవసరం లేకున్నా ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో ఊర్లకు ఊర్లు ఖాళీ చేయించి ప్రజల ఉసురు పోసుకున్నారన్నారు.

తిరుపతిలో రైల్వే కల్యాణ మండపానికి నేడు భూమిపూజ

తిరుపతి(సెంట్రల్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే ఉద్యోగుల కోసం నిర్మించనున్న కల్యాణ మండపానికి శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణకుమార్ జైన్ భూమిపూజ చేయనున్నారు. తిరుపతి పర్యటన నిమిత్తం వస్తున్న ఆయన తిరుమల శ్రీవారి దర్శనానంతరం పడమర రైల్వేస్టేషన్ సమీపంలో కల్యాణ మండపానికి భూమిపూజ చేస్తారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు.

వాహనం నడిపేటప్పుడు కుటుంబాన్ని గుర్తు పెట్టుకోండి

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం ● రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారుల మరణాలే ఎక్కువ: కలెక్టర్





హెల్మెట్‌తో ద్విచక్రవాహనదారుల ర్యాలీ - ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వాహనం నడిపేటపడు కుటుంబీకులను గుర్తుంచుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. గురువారం జిల్లా రవాణాశాఖ కార్యాలయం వద్ద ద్విచక్రవాహనాల ర్యాలీని ఆయన ప్రారంభించారు. దర్గా, ఎంఎస్ఆర్, గాంధీ సర్కిళ్ల మీదుగా పీవీకేఎన్ కళాశాల వరకు ర్యాలీ సాగింది. 36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి రవాణాశాఖ ఈ ర్యాలీ నిర్వహించింది. కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మరణాలు ద్విచక్రవాహనదారులవే ఉన్నాయని చెప్పారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తే చాలా వరకు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి, అతి వేగంగా వాహనాలు నడపరాదని అన్నారు. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి తగిన జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. డీటీసీ నిరంజన్ రెడ్డి, ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు రాజేశ్వరరావు, టీఎన్ మురళి, నరసింహులు, దీపిక తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి 'డిప్యూటీ' పోటు

● భూమన ముఖ్య విధేయుడు దూరం ● కార్పొరేటర్లను కాపాడుకోవడానికి తంటాలు
● తమిళనాడు రిసార్ట్స్‌లో వైసీపీ నేతల రెస్ట్

తిరుపతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక స్థానిక వైసీపీకి తలపోటుగా మారింది. ఆ పార్టీ నుంచి 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్‌రెడ్డిని డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ప్రకటించడంతో భూమన విధేయుల్లో అసమ్మతి సెగ రేగింది. సుదీర్ఘకాలం పాటు భూమన కరుణాకర్ రెడ్డి వెంట నడిచిన కార్పొరేటర్ ఎస్కే బాబు తీవ్రమనస్తాపం చెందారు. రెండు రోజుల కిందట భూమన ఇంట్లో జరిగిన కార్పొరేటర్ల సమావేశానికి గైర్హాజరయ్యారు. దీంతో స్థానిక నాయకత్వం ఆయన్ను తీవ్రంగా తూలనాడినట్టుగా తెలుస్తోంది. దీంతో ఆయన కాస్త రాజకీయ వైరాగ్యానికి గురయ్యారు. మనిషి జీవితం పేపరులాంటిదని ఎంత నలిగితే అంత నిలబడుతుందన్న సందేశంతో సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆయన ఎవరిని ఉద్దేశించి అన్నారో, ఎందుకు అనాల్సివచ్చిందో రాజకీయవర్గాలకు తెలిసినప్పటికీ, సాధారణ ప్రజానీకం కూడా చర్చించుకోవడం మొదలు పెట్టారు. గురువారం మరో వీడియో తన సోషల్ మీడియాలో విడుదల చేసి ఇక వైసీపీకి గుడ్‌బై అన్నట్టుగా నర్మగర్భంగా తేల్చేశారు. ఇంతకాలం నమ్మినబంటుగా ఉన్న వ్యక్తి పరిస్థితే ఇలా ఉంటే ఇక మిగతావారి పరిస్థితి ఎలావుంటుందోనన్న ఆందోళనలో కొందరు కార్పొరేటర్లు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో కూటమి పార్టీ నాయకులు ఎస్కే బాబుతో టచ్‌లోకి వెళ్లినట్టు తెలుస్తోంది. డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఎస్కే ఎటు వైపు ఉంటారన్న ప్రచారం జరుగుతోంది.

మహాబలిపురంలో వైసీపీ క్యాంప్

సొంత పార్టీ కార్పొరేటర్లను కాపాడుకునేందుకు వైసీపీ నానా తంటాలు పడుతోంది. స్థానిక నాయకత్వం డిప్యూటీ మేయర్ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. క్యాంపు రాజకీయాల్లో ఆరితేరినవారిని రంగంలోకి దింపింది. గురువారం ఉదయం సుమారు 20 మంది కార్పొరేటర్లు మహాబలిపురం పయనమైనట్టుగా తెలుస్తోంది. తొలుత పాండిచ్చేరి, గోవా, బెంగళూరు.. ఇలా పలు ఊర్లు పేర్లు చెప్పి చివరికి మహాబలిపురం సమీపంలోని ఓ రిసార్ట్స్‌లో దిగినట్టు సమాచారం. క్యాంపు ఖర్చులన్నింటినీ డిప్యూటీ మేయర్ అభ్యర్థి శేఖర్‌రెడ్డి భుజాలపై స్థానిక నాయకత్వం పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే.. అధికార పార్టీని ధిక్కరించి ఏడాది గడువున్న డిప్యూటీ మేయర్ పదవి తనకు అవసరమా? అన్న సందిగ్ధంలో కూడా అభ్యర్థి ఉన్నట్టు సమాచారం. మరోవైపు క్యాంపునకు వెళ్లినవారి కుటుంబ సభ్యులు కొందరు కూటమి నేతలతో టచ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ముందు డిప్యూటీ మేయర్ ఎన్నిక పరిణామాలు ఎలా మారతాయో కానీ ప్రస్తుతానికి వైసీపీ క్యాంపు రాజకీయ వ్యవహారంతో వాతావరణం వేడెక్కింది.

బెదిరిస్తే ఊరుకోం: భూమన

ప్రజాస్వామ్యంగా ఎన్నిక జరగాలిని, తమ కార్పొరేటర్లను బెదిరించి లొంగదీసుకోవాలని చూస్తే ఏ పోరాటాలకైనా సిద్ధపడతామంటూ భూమన కరుణాకర్‌రెడ్డి గురువారం ఓ సెల్ఫీ వీడియో విడుదలచేశారు. రాష్ట్ర వైసీపీ మొత్తం తిరుపతిలో తిష్ట వేస్తుందని, కార్పొరేటర్లను బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

- అయితే, గత మున్సిపల్ ఎన్నికలు ఎంతటి ప్రజాస్వామ్యయుతంగా జరిగాయో ఇప్పుడూ అంతే పద్ధతిగా ఉంటాయని 'నీవు నేర్పిన విద్యే నీరజాక్ష' అంటూ పలువురు నెటిజన్లు వ్యాఖ్యానాలు చేయడం గమనార్హం.

రంగంలోకి రోడ్డు విస్తరణ..!

● మార్చిలోపు మూడో రీచ్ పనుల ప్రారంభానికి కసరత్తు ● కుప్పంలో కడా పీడీ తనిఖీలు


అధికారులతో రోడ్డు విస్తరణ వివరాలు అడిగి తెలుసుకుంటున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ప్రధాన రహదారి విస్తరణ పనులు మళ్లీ రంగంలోకి వచ్చాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అర్ధాంతరంగా ఆగిన పనులను తిరిగి ప్రారంభించడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. కడా పీడీ వికాస్ మర్మత్ ఆర్ అండ్ బీ అధికారులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులతో కలిసి ప్రధాన రహదారిలో తనిఖీలు నిర్వహించారు. కుప్పం పట్టణంలో నేతాజీ రోడ్డు ప్రధాన రహదారిగా కొనసాగుతోంది. చాలా ఇరుకుగా ఉన్న ఈ రహదారిని విస్తరించడానికి 2014-2019లో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించి, అందుకు అవసరమైన చర్యలు తీసుకుంది. కుప్పం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి కుప్పం చెరువు కట్ట, అక్కడి నుంచి ఎంఆర్ రెడ్డి కూడలి, ఈ కూడలి నుంచి పాత రైల్వే గేటు.. ఇలా మూడు రీచ్‌లుగా రోడ్డును విభజించింది. అప్పట్లో రోడ్డు విస్తరణ విషయంలో స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. అయితే ఈ పనులు జరిగి రోడ్డు వెడల్పు చేస్తేనే పట్టణం సుందర రూపం సంతరించుకోవడంతోపాటు అభివృద్ధి జరుగుతుందని భావించిన నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలతో విస్తృతంగా సమావేశాలు ఏర్పాటు చేయించారు. అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ, పట్టణ ప్రముఖులతో ఆయా వర్గాలతో ముఖాముఖి మాట్లాడించి ప్రజల నుంచి కొంత సమ్మతిని రాబట్టగలిగారు. దీంతో నేతాజీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభయ్యాయి. కుప్పం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి చెరువుకట్ట వరకు ఎక్కువగా ప్రభుత్వ స్థలాలే ఉండటంతో విస్తరణకు ఎటువంటి ఆటంకం ఎదురు కాలేదు. తర్వాత చెరువు కట్ట నుంచి ఎంఆర్ రెడ్డి కూడలి వరకు విస్తరణ పనులు ప్రారంభించినప్పుడు ఎక్కువ నివాసాలు, దుకాణ సముదాయాలు ఉండటంతో ప్రజలనుంచి వ్యతిరేకత ఏర్పడి సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లయింది. చివరకు నష్టపరిహారాన్ని పెంచి ప్రజలను సమాధానపరచి రెండో రీచ్ విస్తరణ పనులను దాదాపు పూర్తి చేశారు. అయితే కొందరు బాధితులు కోర్టుకు వెళ్లడంతో రెండో రీచ్‌లో కొంత భాగంతోపాటు, మూడో రీచ్ విస్తరణ పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత టీడీపీ ప్రభుత్వం దిగిపోయి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డు విస్తరణ పనుల గురించి పట్టించుకునే దిక్కే లేకుండా పోయింది.

● ఇప్పుడు మళ్లీ..

టీడీపీ తిరిగి అధికారంలోకి రావడంతో అర్ధాంతరంగా ఆగిపోయిన రోడ్డు విస్తరణ పనులను తిరిగి మొదలు పెట్టడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు కడా (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) అందుకు సిద్ధమైంది. ముఖ్యమంత్రి ఈనెల 6, 7 తేదీల్లో కుప్పంలో పర్యటించిన సమయంలో పురపాలక సంఘం అభివృద్ధి కోసం ఏకంగా రూ.92 కోట్లు మంజూరు చేశారు. ఇందులో ఉద్యానవనాల సుందరీకరణ, ట్రాఫిక్ ఊడళ్ల ఆధునీకరణ వంటి అభివృద్ధి పనులతోపాటు రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులు ఉన్నాయి. ఇందులో భాగంగానే ఇప్పుడు ప్రధాన రహదారి అయిన నేతాజీ రోడ్డు విస్తరణ తిరిగి చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఆగిపోయిన విస్తరణను చేపట్టాలంటే ముందుగా ప్రజాభిప్రాయాన్ని అనుకూలంగా మలచుకోవాలి. ఈ నేపథ్యంలోనే కడా పీడీ వికాస్ మర్మత్ గురువారం పాత రైల్వే గేటునుంచి కొంత దూరం అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. గతంలో మార్కింగ్ చేసిన విధానాన్ని, విస్తరణ చేస్తే తొలగించాల్సి వచ్చే దుకాణ సముదాయాలు, ఇతర నివాసాలను పరిశీలించారు.

ప్రస్తుతం మూడో రీచ్ భాగమైన ఎంఆర్ రెడ్డి కూడలి నుంచి పాత రైల్వే గేటు వరకు ఉన్న రోడ్డు వెడల్పు సుమారు 50 అడుగులు ఉంది. ఈ రోడ్డును దాదాపు 70-75 అడుగుల వెడల్పుకు విస్తరించాల్సి ఉన్నదని, అందుకు అవసరమైన మార్కింగ్ చేయాలని పీడీ ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. కొత్త మార్కింగ్ చేయకపోవడంతో వారిపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలని, ప్రజలు మరింతగా బాగుపడాలన్న ఉద్దేశంతోనే సీఎం చంద్రబాబు కోట్ల రూపాయలు మంజూరు చేశారన్నారు. ఇందులో భాగంగా మూడో రీచ్ రోడ్డు విస్తరణ పనులను చేపడుతామన్నారు. మూడో రీచ్ విస్తరణ పనులను మార్చి నెలలో ప్రారంభిస్తామన్నారు. దీనికి ప్రతిఒక్కరూ సహకరించాలని పీడీ వికాస్ మర్మత్ కోరారు.

● కొసమెరుపు

కుప్పంలోని ప్రధాన రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించడానికి అధికారులు ఉత్సాహంగా ఉన్నారు. తనిఖీలతో గురువారం కడా పీడీ వికాస్ మర్మత్ అందుకు శ్రీకారం చుట్టారు. అంతా బాగానే ఉన్నా.. విస్తరణ పనులకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బ్రేక్ పడింది. అధికారికంగానే ఈ పనులు ఆగిపోయాయి. కుప్పంలో మూడో రీచ్ విస్తరణ పనుల కోసం కుదుర్చుకున్న ఒప్పందాన్ని నిలుపుదల చేస్తున్నట్లు అప్పటి ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీరు 2020 సెప్టెంబరు 8వ తేదీన ఉత్తర్వులు ఇవ్వడమే కారణం. అంటే అప్పటి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే రోడ్డు విస్తరణ పనులకు మోకాలడ్డింది. ఈ ఉత్తర్వులను రద్దు చేస్తూ ఇంతవరకూ టీడీపీ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఏవీ రాలేదు. మూడో రీచ్ పనులను వైసీపీ ప్రభుత్వంలో రద్దు చేస్తూ ఉత్తర్వులు ఉన్నట్లు కడా పీడీకి ఆర్ అండ్ బీ అధికారులు ఇప్పటివరకు తెలియజేయలేదు. తీరా గురువారం తనిఖీలు ప్రారంభించిన సమయంలో ఈ ఉత్తర్వులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పీడీ తీవ్ర ఆగ్రహానికి గురై వారిని మందలించారు. ఈ నేపథ్యంలో మూడో రీచ్ విస్తరణ పనులు ప్రారంభం కావాలంటే అందుకు అవసరమైన తాజా ఉత్వర్వులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. ఆ ఉత్తర్వులు ఎంత త్వరగా తెప్పిస్తే అంత త్వరగా పనులు ప్రారంభమవుతాయి. లేదంటే అనివార్యమైన ఆలస్యం తప్పదు.


విస్తరణ పనులు జరగాల్సిన నేతాజీ రోడ్డు మూడో రీచ్

పరిసరాల శుభ్రతపై నిరంతర పర్యవేక్షణ


గ్రామంలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న వైద్యశాఖ అధికారులు

బైరెడ్డిపల్లి, జనవరి30 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని.. స్థానికులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి సుధారాణి సూచించారు. గురువారం మండలంలోని తిరుమలనాయనికుప్పం గ్రామంలో జిల్లా వైద్య శాఖ ఉన్నతాధికారులు పర్యటించారు. రెండు రోజుల క్రితం వైష్ణవి అనే బాలిక తీవ్ర జ్వరంతో మృతిచెందడంతో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, వైద్యాధికారులు విజయ్‌చందర్, శిరీష గ్రామాన్ని సందర్శించారు. పరిసరాలను పరిశీలించి గ్రామస్థులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అనూరాధ, సబ్ యూనిట్ అధికారి జయశంకర్, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, సూపర్‌వైజర్లు గోపి, పుష్పలత, మౌనిక పాల్గొన్నారు.

అటవీ చట్టాలను ఉల్లంఘించిన పెద్దిరెడ్డి శిక్షార్హుడు



కల్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అటవీ చట్టాలను ఉల్లంఘించిన వారు శిక్షార్హులని.. అటవీ భూములను ఆక్రమించడం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తగదని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాధనాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యులు మురళీధర్ తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ బంగ్లాలో గురువారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన వ్యవసాయ క్షేత్రంలో కూలీల కోసమే గెస్ట్‌హౌస్ నిర్మించానని పెద్దిరెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కబ్జాకు గురైన భూములను తక్షణం పేదలకు పంచాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, ధనంజయ నాయుడు, మురళీధర్‌నాయుడు, గోపీనాధరెడ్డి, ప్రభాకర్, జూపల్లి నాగరాజు, కరుణాకర్‌నాయుడు, నాగరాజనాయుడు, కొండ మురళీ, రమేష్, మహేష్, అనిల్, సురేంద్ర, అబ్బాస్, అన్సర్‌బాషా, ఖాదర్‌వల్లి, మునిరత్నం, జనసేన నాయకులు చంద్ర, మోహన్, మునిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అప్రమత్తత అవసరం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మధుసూదనాచారి

పుంగనూరు, జనవరి30 (ఆంధ్రజ్యోతి): గుండె జబ్బు లక్షణాలు కనిపించిన వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు పొందాలని పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదనాచారి కోరారు. గురువారం స్థానిక ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రోగులతో మాట్లాడుతూ ఛాతిలో నొప్పి లక్షణాలుంటే ఏరియా ఆసుపత్రికి తీసుకురావాలన్నారు. ఆసుపత్రిలో ఈసీజీ తీసి కార్డియాలజిస్టును సంప్రదించి రూ.45 వేలు విలువైన ఇంజక్షన్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఆర్ఎంవో హిమశైలజ, డాక్టర్ అనురాధ, నర్సింగ్ సూపరింటెండెంట్ భారతి సిబ్బంది పాల్గొన్నారు.

ఏనుగుల దాడుల పరిహారం పంపిణీ


సోమలలో పరిహారం అందిస్తున్న అధికారులు

సోమల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇరికిపెంట పంచాయతీ పరిధిలో ఏనుగుల దాడులతో నష్టపోయిన నలుగురు రైతులకు గురువారం సచివాలయంలో రూ.40 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో బాలసుబ్రహ్మణ్యం, బీఎఫ్‌వో బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శి మేనక మాజీ సర్పంచ్ శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

● సదుం: సదుం మండలంలో ఏనుగుల దాడుల్లో పంట కోల్పోయిన రైతులకు గురువారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎఫ్ఎస్‌వో ఇంద్రాణి పరిహారం పంపిణీ చేశారు. ఎం.గొల్లపల్లెకు చెందిన లోకనాథం, గుడ్లవారిపల్లెకు చెందిన ఎస్.హేమావతి, మోహన్‌రెడ్డిలతోపాటు సోమల మండలంలోని బాధితులకు రూ.4,65,000 పరిహారం అందజేశామన్నారు. ఎఫ్‌బీవోలు ఎస్ఆర్ రెడ్డి, షాజహాన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు


కల్లూరులో దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ నాగపద్మిని

కల్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని చిత్తూరు రైతు శిక్షణకేంద్రం ఏడీఏ నాగపద్మిని, ఏవోలు ప్రసన్నలక్ష్మీ, హరిప్రసాద్ తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలోని మణికంఠ, శ్రీనివాస ఎరువులు, పురుగుమందుల దుకాణాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ నిల్వలు, లైసెన్సులు పరిశీలించారు. గడువు ముగిసిన ఎరువులు, పురుగు మందులు విక్రయించరాదని సూచించారు. దుకాణాల ఎదుట రైతులకు తెలిసేలా ధరల బోర్డులు పెట్టాలన్నారు. ప్రభుత్వం అనుమతించిన కంపెనీ ఉత్పత్తులనే విక్రయించాలని, కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు.

కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మిద్దాం


రొంపిచెర్లలో మానవహారం

కల్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దామని ప్రభుత్వ వైద్యాధికారిణి జానకీరావు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో గురువారం జాతీయ కుష్ఠువ్యాధి వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధి ప్రారంభ దశలోనే గుర్తిస్తే ఆ వ్యాధిని పూర్తిగా నిర్మూలించొచ్చన్నారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● రొంపిచెర్ల: ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినయ్, డాక్టర్ దినేష్‌కుమార్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం కుష్ఠువ్యాధిపై రొంపిచెర్లలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజేశ్వరి, సీహెచ్‌వో కాంతమ్మ, పంకజ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత పెద్దబ్బనాయుడి మృతి


నివాళులర్పిస్తున్న గౌనివారి శ్రీనివాసులు

రామకుప్పం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఉమ్మడి వీర్నమల పంచాయతీ మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత పెద్దబ్బనాయుడు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, సీనియర్ నేతలు గంట్లప్పగౌడు, మనోహర్, సత్తి జయశంకర్, గజేంద్ర, రాజారాం, భూపతి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

2న ఉచిత నేత్ర వైద్యశిబిరం

పలమనేరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఫిబ్రవరి 2వ తేదీన ఆదివారం ఉచిత నేత్రచికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు ప్రభాకర్ తెలిపారు. శిబిరంలో చెన్నై శంకర నేత్రాలయ నేత్ర వైద్యులు మురళీ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, ఆపరేషన్లు అవసరమున్న వారికి చెన్నై శంకర నేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గిరిజనులకు మౌలిక వసతులు కల్పించాలి


గిరిజనులతో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

చౌడేపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు మౌలిక వసతులు కల్పించాలని జేసీ విద్యాధరి సూచించారు. గురువారం మండలంలోని దిగువపల్లె పంచాయతీలోని నేతిగుట్ట, వెంగళపల్లె పంచాయతీలోని నరసింహపురం గిరిజన కాలనీకి చేరుకుని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీవో లీలామాధవి, ఏఈ మణి, ఈవోపీఆర్డీ కృష్ణవేణి, ట్రాన్స్‌కో ఏఈ శశిధర్, సర్వేయర్ గుణశేఖర్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటా: చల్లా


రొంపిచెర్లలో సమస్యలు తెలియజేస్తున్న టీడీపీ కార్యకర్తలు

రొంపిచెర్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం రొంపిచెర్లలో ఆయన ఇంటికి చౌడేపల్లి, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలకు చెందిన పలువురు నాయకులు చేరుకుని సమస్యలు విన్నవించారు. అనంతరం పులిచెర్ల మండలం కల్లూరులో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం నిర్వహించే ఆత్మార్పణ వేడుకలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో పుట్లా అనిల్, రాజేష్, సుధాకర్, అబ్బాస్, కుమార్‌రెడ్డి, కరుణాకర్‌నాయుడు, మందపల్లి రఘునాథ, మదనమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబా విద్యాలయం తనిఖీ


కేజీబీవీలో తనిఖీ చేస్తున్న వెంకట్రమణ

రొంపిచెర్ల, జనవరి 30 (ఆంధ్ర జ్యోతి): రొంపిచెర్లలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ఎస్ఎస్ అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎం.వెంకట్రమణ, జీసీడీవో ఇందిరాదేవి గురువారం తనిఖీలు చేశారు. ఆరోపణలపై సమగ్రంగా విచారించారు. సమస్యలు గుర్తించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అందరూ కలిసి పనిచేసి విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించాలని సూచించారు. సమస్యలు పునరావృతం కాకుండా పనిచేయాలన్నారు. భోజనాలు మెనూప్రకారం నాణ్యతగా పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఇందిర, శ్రీనివాసులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

స్థలాల అన్యాక్రాంతంపై కఠిన చర్యలు

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి


సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలోని గంటావూరు ఇందిరమ్మ కాలనీలో పేదల స్థలాలను అన్యాక్రాంతం చేయడంతో పాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి ఫోర్జరీ పట్టాలతో సొమ్ముచేసుకొన్ని వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మున్సిపల్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గంటావూరు కాలనీలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి'తో పాటు పలు దినపత్రికల్లో వస్తున్న వార్తాకథనాలపై ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో స్థానిక తహసీల్దారు ఇన్బనాధన్, మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డితో పాటు రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు గుర్తించిన ఖాళీ స్థలాలను అర్హులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేయడంతో పాటు ఫోర్జరీ పట్టాలు భాగోతంపై సమగ్రంగా విచారించి బాధ్యులైన వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు ఇలాంటి విషయాల్లో ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడొద్దన్నారు. అధికారులు ఉదాసీనంగా ఉంటే అక్రమార్కులు మరింత కబ్జాలకు పాల్పడే ప్రమాదం ఉందని సూచించారు. గంటావూరు ఇందిరమ్మకాలనీలో సమగ్ర దర్యాప్తు చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా పట్టాలు పొందిన వారి కారణంగానే కాలనీలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

పౌరహక్కులపై అవగాహన తప్పనిసరి


కోటమాకులపల్లెలో మాట్లాడుతున్న తహసీల్దారు సీతారామ్

గుడుపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పౌరహక్కులపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని.. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు సీతారామ్ సూచించారు. గురువారం ఓఎన్ కొత్తూరు పంచాయతీ కోటమాకులపల్లె గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో బాలకృష్ణ, ఏపీవో ధనయ్య, ఏపీఎం గ్రీటా, కార్యదర్శి శ్రీనివాసులు, మండల బీజేపీ అధ్యక్షులు రామచంద్ర, పోలీసులు, పౌర హక్కుల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

●రామకుప్పం: ప్రజలు తమ హక్కులను వినియోగించుకోవాలని తహసీల్దారు బాబు కోరారు. గురువారం సాయంత్రం మండల పరిధి గడ్డూరు గ్రామంలో పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో మురళీధర్‌రెడ్డి, ఆర్ఐ నారాయణప్ప, సర్పంచ్ రాజగోపాల్, జనసేన మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్, టీడీపీ నేతలు మునిరెడ్డి, సతీష్, దళిత నేత గోవిందప్ప పాల్గొన్నారు.

నాటుతుపాకీ కలకలం

పలమనేరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం ముడివారిపల్లి గ్రామంలో గురువారం నాటుతుపాకీ కలకలం రేపింది. దొడ్డిపల్లి గ్రామానికి చెందిన నగేష్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. ముడివారిపల్లి గ్రామానికి చెందిన నగేష్, శివ గ్రామసమీపంలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు నాటుతుపాకీతో వెళ్లారు. అడవిలో ఇద్దరి మధ్య వివాదం రావడంతో శివ పలమనేరు పోలీసులకు నగేష్ వద్ద నాటుతుపాకీ ఉన్నట్లు సమాచారం అందించాడు. దీంతో నగేష్‌ను పలమనేరు పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. పలమనేరు సీఐ నరసింహరాజు విచారిస్తున్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం పుంగనూరు మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని ఏతూరుకు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు గంగరాజు(32) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయం, కుటుంబ ఖర్చుల కోసం చేసిన అప్పులు చెల్లించాలని ఒత్తిళ్లు రావడంతో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

దాడిపై పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తన స్నేహితుడు అతిగా మద్యం తాగుతున్నాడని గుర్తించి .. మందలించినందుకు మరో ఇద్దరితో తనపై దాడి చేసి గాయపరిచాడని బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని కథనం మేరకు.. పెద్దపంజాణి మండలం చీమనపల్లెకు చెందిన రెడ్డెప్ప కుమారుడు జయరాజ్(19) తన స్నేహితుడు అమరేష్ మద్యం అతిగా తాగుతుండటంతో వద్దని మందలించాడు. విషయాన్ని అమరేష్ తన స్నేహితులు విష్ణువర్ధన్, కల్యాణ్‌కు చెప్పాడు. దీంతో అతడిపై దాడి చేసి గాయపరిచారు. పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్సలు పొందాడు.

అహింసే విలువైన ఆయుధం

● ఊరూరా మహాత్మా గాంధీజీకి ఘన నివాళులు


కుప్పం టీడీపీ కార్యాలయంలో ...

కుప్పం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అన్యాయం, అధర్మంపై పోరాటం చేయాలంటే అహింసకు మించిన ఆయుధం లేదని నిరూపించిన మానవతామూర్తి మహాత్మా గాంధీజీ అని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వా ళుర్పించారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో సైతం మహాత్మాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●పలమనేరు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.● పలమనేరు పొట్టి శ్రీరాములు బజారు వీధిలో బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆర్యవైశ్యులు నివాళులర్పించారు. ● పుంగనూరు: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పుంగనూరు మండలం గూడూరుపల్లె జడ్పీ హైస్కూల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


పలమనేరులో...


పుంగనూరులో గాంధీ చిత్రపటానికి నివాళులు

పాలిటెక్నిక్ విద్యార్థులకు టెక్సాస్ కంపెనీలో ఉద్యోగాలు


తేజశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

కుప్పం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని డాక్టర్ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విద్యార్థిని వి.తేజశ్రీ అంతర్జాతీయ కంపెనీ టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్ నిర్వహించిన ప్రాంగణ ఇంటర్వ్యూలలో నెగ్గి ఆ సంస్థలో ఉద్యోగానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు తెలిపారు. ఆ ఇంటర్వ్యూలకు మొత్తం 1200 మంది పాల్గొనగా 98 మంది చివరి రౌండ్‌కు అర్హత సాధించారన్నారు. వీరిలో మళ్లీ మౌఖిక పరీక్షతో రాష్ట్రం మొత్తానికి ఎంపికైన 15 మంది విద్యార్థుల్లో తేజశ్రీ ఉన్నట్లు చెప్పారు. ఈ ప్రాంగణ నియామకాలలో ఎంపికైన విద్యార్థినికి రూ.9.02 లక్షల వేతన ప్యాకేజీతోపాటు ప్రఖ్యాత బిట్స్ పిలాని విద్యా సంస్థలో బి.టెక్ చదవడానికి టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్ కంపెనీ అవకాశం కల్పిస్తుందన్నారు. విద్యార్థిని తేజశ్రీని ప్రిన్సిపాల్‌తోపాటు ఈసీఈ విభాగాధిపతి సీహెచ్.సుబ్బన్న, సిబ్బంది డి.శిరీష, రాధ, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.


ఎం.పూర్ణిమ

●పలమనేరు: పలమనేరు మహిళా పాలిటెక్నిక్‌లో డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ చివరి సంవత్సరం విద్యార్థిని ఎం.పూర్ణిమ రూ.9.02 లక్షల ప్యాకేజీ ఉద్యోగానికి ఎంపికైంది. ఏపీ ప్రభుత్వం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్ కంపెనీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో పలమనేరు విద్యార్థిని ఎం.పూర్ణిమ ఎంపికయ్యారు. అధ్యాపకుల మహమ్మద్, ప్రసన్న, డా.శ్రీవిద్య, డా.స్రవంతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

పుంగనూరు రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు హార్ట్ టు హెల్ప్ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రవినాయక్ గురువారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. పుంగనూరు మండలం ఈడిగపల్లె, పూజగానిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 73 మంది విద్యార్థులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు రియాజ్‌ఉన్నిషా, రెడ్డెమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించడంతో సురక్షిత ప్రయాణం

చౌడేపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరిస్తే సురక్షితంగా ప్రయాణం చేయొచ్చని ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమలో కానిస్టేబుల్ ముని తదితరులు పాల్గొన్నారు.

జాతిపితకు నివాళి



గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పించిన మేయర్ అముద తదితరులు

చిత్తూరు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఉదయం గాంధీ విగ్రహానికి మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్ కుమార్‌రెడ్డి పుష్పాంజలి సమర్పించారు. అనంతరం నగరపాలక కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు కల్చరల్: కాంగ్రెస్ కార్యాలయంలోనూ గాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. నాయకులు పోటుగారి భాస్కర్, పరదేశి, ఉమేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు



టీవీఎన్‌ఆర్‌పురంలో హెచ్చరిక బోర్డు పెట్టిన రెవెన్యూ సిబ్బంది

పాలసముద్రం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని తహసీల్దార్ అరుణకుమారి హెచ్చరించారు. టీవీఎన్‌ఆర్‌పురం గ్రామ సమీపంలో ఉన్న నరసింహాపురం చెరువు పక్కన ఉన్న 50 ఎకరాల ప్రభుత్వ భూమిని అయ్యవారికండ్రిగ గ్రామానికి చెందిన కొందరు వైసీపీ నాయకులు చదును చేయించారు. ఈ విషయాన్ని గ్రామస్తులు కలెక్టర్, తహసీల్దార్‌కి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఇక్కడ హెచ్చరిక బోర్డును తహసీల్దార్ ఏర్పాటు చేయించారు. ఆక్రమణదారులను పిలిపించి ప్రభుత్వ భూముల్లో ప్రవేశిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. ఆర్ఐ దేవి, సర్వేయర్ గణేష్, ఇరిగేషన్ ఏఈ చీరాలయ్య, సర్పంచ్ అమరావతి, వీఆర్వోలు రమేష్‌నాయుడు, శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ గుంతను పూడ్చలేరా?



కల్వర్టు విరిగి పోవడంతో నడిరోడ్డుపై గుంత ఏర్పడింది. రాఘవ థియేటర్ వెనుక ఝాన్సీ లక్ష్మి వీధికి వెళ్లే మార్గంలో రోడ్డుపై ఉన్న కల్వర్టు దెబ్బతిని గుంతలా మారింది. దీనివల్ల ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. పెద్ద ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

- చిత్తూరు సిటీ, ఆంధ్రజ్యోతి

దివ్యాంగులను ఆదుకోండి

● సీనియర్ సివిల్ జడ్జి భారతి



భవిత సెంటర్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి భారతి

గుడిపాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను ఆదుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి భారతి సూచించారు. గురువారం నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లోని భవిత సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. భవిత సెంటర్ నిర్వాహకులు వాణి, భవిత, ఎస్ఐ రామ్మోహన్, మహిళా పోలీసు పావని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు పట్టాల మంజూరు: కలెక్టర్

చిత్తూరు సెంట్రల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పాతపాళ్యంకు చెందిన నాగయ్యతో పాటు బాధితులకు పట్టాల మంజూరుకు ఆదేశాలు చేసినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. లంచం ఇవ్వలేదని మొక్కలను పీకేశారంటూ వీఆర్వో చంద్రబాబు, తలారీ చిన్నబ్బపై ఫిర్యాదు చేస్తూ బాధితులు బుధవారం కలెక్టరేట్‌లో పీకేసిన మొక్కలతో రోజంతా నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రస్తుతం వీరు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వడంతోపాటు వీఆర్వో, తలారీలపై విచారణకు ఆదేశించినట్లు పేర్కొన్నారు.

చెత్త సేకరణ కేంద్రాలను 15లోపు వినియోగంలోకి తేవాలి

● డీపీవో సుధాకరరావు



సమావేశంలో ప్రసంగిస్తున్న డీపీవో సుధాకరరావు

నగరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఫిబ్రవరి 15వ తేదీలోపు వినియోగంలోకి తేవాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) సుధాకరరావు అన్నారు. నగరి, నిండ్ర, విజయపురం మండలాల్లో గురువారం ఆయన పర్యటించారు. మూడు మండలాలకు చెందిన ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులతో నగరి వెలుగు కార్యాలయంలో సమావేశమయ్యారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు. ఎంపీడీవో సతీష్, నగరి, నిండ్ర, విజయపురం ఈవోపీఆర్డీలు అరుణమ్మ, లక్ష్మీపతి, రాజేంద్రన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగులతో డీపీవో సమీక్షించారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే సంబంధిత గ్రామ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం డీపీవోను ఈవో నాగరత్నమ్మ సత్కరించారు.

ఎరువులను అధిక ధరలకు అమ్మితే చర్యలు

శ్రీరంగరాజపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, భూసంరక్షణ వ్యవసాయ అధికారి శివప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం మండలం కేంద్రంలోని పలు ఎరువు దుకాణాలను తనిఖీ చేశారు. ఓ దుకాణంలో అధిక ధరలు రికార్డులో ఉండడంతో నిర్వాహకులకు నోటీసులిచ్చినట్లు తెలిపారు. వ్యవయాధికారి నర్మద, ఉత్పత్తుల డీలర్ల తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: సీఐ

యాదమరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు సీఐ శ్రీధర్ నాయుడు, ఎస్ఐ ఈశ్వర్ సూచించారు. గురువారం సాయంత్రం యాదమరి పోలీసు స్టేషన్ వద్ద చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిపై వాహనాల రికార్డులు తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు.

వైసీపీ మహిళా విభాగ అధ్యక్షురాలిగా రాధిక



వెదురుకుప్పం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జీడీనెల్లూరు నియోజకవర్గ వైసీపీ మహిళా అధ్యక్షురాలిగా వెదురుకుప్పం ఎంపీటీసీ సభ్యురాలు ఎస్.రాధిక నియమితులయ్యారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన పార్టీ నాయకులు నారాయణస్వామి, కరుణాకరరెడ్డి, కృపాలక్ష్మి, ఎంపీపీ నాగరాణి, వైస్ ఎంపీపీ రమణ సుబ్రహ్మణ్యం, విజయ మునికృష్ణారెడ్డి, జడ్పీటీసీ సుకుమార్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు.

లీగల్ సెల్ అధ్యక్షుడిగా హరిబాబు



గంగాధరనెల్లూరు: నియోజకవర్గ వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా గంగాధరనెల్లూరు దళితవాడకు చెందిన టీఎస్ హరిబాబును నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి నుంచి ఉత్తర్వులు అందాయి. ఈయన మండల వైస్ ఎంపీపీగా కొనసాగుతున్నారు.

కస్తూరిబా విద్యాలయం తనిఖీ

రొంపిచెర్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ, జీసీడీవో ఇందిరాదేవి గురువారం తనిఖీలు చేశారు. ఆరోపణలపై సమగ్రంగా విచారించారు. అందరూ కలిసి పనిచేసి విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించాలని సూచించారు. భోజనాలు మెనూప్రకారం నాణ్యతగా పెట్టాలని కోరారు. ఎంఈవోలు ఇందిర, శ్రీనివాసులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి ఆకతాయి వేధింపులు

● కార్వేటినగరం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు

వెదురుకుప్పం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉపాధ్యాయినిని వెదురుకుప్పం మండలంలో ఓ గ్రామానికి చెందిన యువకుడు వేధింపులకు గురిచేస్తుండేవాడు. దీనిపై ఉపాధ్యాయిని బుధవారం ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్ గురువారం మీడియాకు తెలిపారు.



రక్షణ కల్పించండి

చిత్తూరు సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగదాల ప్రత్యర్థులు తమపై తరచూ దాడిచేస్తున్నారని, రక్షణ కల్పించాలని బంగారుపాళ్యం మండలం సీజీఎఫ్ కాలనీకి చెందిన కటారి గుణశేఖర్ విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. తమ గ్రామంలో 5.50 ఎకరాలకు సంబంధించి తమ కుటుంబానికి కటారి గిరీష్, చంద్రమ్మ, తులసీరామ్‌తో ఆస్తి తగాదాలున్నాయని చెప్పారు. సదరు భూమికి సంబంధించి పూర్తి హక్కులను న్యాయస్థానం ద్వారా తమకే దక్కిందని అన్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేక ప్రత్యర్థులు తమ కుటుంబీకులపై తరచూ భౌతిక దాడులకు పాల్పడుతున్నారని వాపోయారు. దీనిపై బంగారుపాళ్యం పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని, ఎస్పీ స్పందించి తమకు రక్షణ కల్పించాలని కోరారు.

పట్టుబడ్డ కోళ్ల దొంగ

పెనుమూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జట్టివానిఒడ్డు గ్రామంలో గురువారం మధ్యాహ్నం నాటుకోళ్లు పట్టుకునేందుకు వచ్చిన ముగ్గురు దొంగల్లో ఒకరిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇతడిని పుత్తూరు టౌన్ మండీ వీధికి చెందిన మదన్‌గా పోలీసులు గుర్తించారు. మిగిలిన ఇద్దరూ అరక్కోణం, చెన్నైలో ఉంటారని మదన్ చెప్పినట్లు తెలిసింది.

ఇసుక డంప్ సీజ్



విజయపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నారపరాజు కండ్రిగలో ఇసుక డంప్‌ను ఎస్ఐ బలరాం గురువారం సీజ్ చేశారు. తమిళనాడుకు ఇసుక తరలిపోతుందని ఫిర్యాదులతో తనిఖీ చేసి, స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇసుక తరలించే ట్రాక్టర్లకు జీపీఆర్ కనెక్ట్ చేయాలని చెప్పారు.

సంక్షిప్తంగా..

'హృదయ రక్ష'పై అవగాహన

బంగారుపాళ్యం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఆరోగ్య కేంద్రంలో హృదయరక్ష (స్టెమీ ప్రోగామ్) ప్రోగ్రాంపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. మెడికల్ ఆఫీసర్ శిరీష, డాక్టర్లు షాలిని, స్వరూప్ నాయక్, భార్గవ్, రాగభవన, విజయకుమారి, సిబ్బంది సుమతి పాల్గొన్నారు.

నగరి: నగరి ఏరియా వైద్యశాలలో జరిగిన సమావేశంలో మెడికల్ సూపరెంటెండెంట్ డాక్టర్ జరీనా, ఆర్ఎంవో మంజుల, వైద్యులు కార్తీక్, ప్రవీణ, దీప్తివదన, శ్రీనాథ్, లోకేష్ జయంత్ మోనిక, పాండు పాల్గొన్నారు.

ముళ్లకంపల తొలగింపు

పెనుమూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అధికారులు పరిశుభ్రతపై దృష్టి సారించారు. పెనుమూరు నుంచి పుత్తూరు రహదారిలో అల్లాల చెరువు కట్టపై రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. గురువారం వీటిని ఎక్స్‌కవేటర్ సాయంతో సెక్రటరీ జ్యోతీశ్వర్ తొలగించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చిత్తూరు సెంట్రల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం 2025 వార్షిక క్యాలెండర్‌ను గురువారం కడపలో ఆర్జేడీ శ్యామ్యూల్ ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం, నాయకులు మురగేషన్, భాస్కర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు నిధుల విడుదలపై హర్షం

గంగాధరనెల్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీల కోసం రూ.896 కోట్ల నిధులు విడుదల చేయడంపై టీడీపీ యాదవ సాధికార జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీ కులాలు అన్నివిధాలా పురోభివృద్ధి సాధించాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆకాంక్షిస్తున్నారని చెప్పారు.

చట్టాలపై అవగాహన సదస్సు

యాదమరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కీనాటంపల్లె గ్రామ పంచాయతీలోని షికారి కాలనీలో గురువారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ పార్థసారధి మాట్లాడుతూ.. దళితుల కుటుంబాల జీవనానికి ఆటంకం కల్పిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. దళిత సంఘం సభ్యులు మురుగేశన్, చిట్టిబాబు, కుమార్ పాల్గొన్నారు.

టీకాలు సకాలంలో వేయించాలి

పాలసముద్రం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, గర్భిణులకు టీకాలు సకాలంలో వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్‌హనుమంతరావు తెలిపారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. డాక్టర్ మోహనకృష్ణ, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

'కూటమి' పాలనలోనే రాష్ట్రాభివృద్ధి: జనసేన

నిండ్ర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతోందని నగరి జనసేన ఇన్‌చార్జి మహేష్ అన్నారు. గురువారం నిండ్రలో ఎంపీడీవో, తహసీల్దార్‌ను కలిసి ప్రజల సమస్యలను తెలియజేశారు. మండల అధ్యక్షుడు శివలింగం, నాయకులు రాధమ్మ, శేఖర్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి: ఏఐటీయూసీ

చిత్తూరు రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు అన్నారు. గురువారం ఎన్టీయూ కార్యాలయంలో కార్మికులతో సమావేశంలో ప్రసంగించారు. జీతంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గోపీనాథ్, విజయ్‌కుమార్, దొరస్వామి, గంగయ్య, చంద్ర పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి



సూర్యకుమారికి జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ కోదండపాణి

ఐరాల(కాణిపాకం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సూర్యకుమారి గురువారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆమెను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి బాలాలయం

వీరాంజనేయ స్వామి ఆలయంలో బాలాలయ ప్రతిష్ఠను ఫిబ్రవరి ఒకటో తేదీనుంచి నిర్వహించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ గురువారం తెలిపారు. శనివారం సాయంత్రం ఐదు నుంచి ఫిబ్రవరి మూడో తేదీ ఉదయం 5.30 గంటల వరకు వివిధ రకాల కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

కార్వేటినగరంలో పశు ఆరోగ్య వైద్యశిబిరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ గోవిందయ్య తదితరులు

వెదురుకుప్పం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ గోవిందయ్య, ఏడీఏలు ఇందిరమ్మ, రూపసుందరి తెలిపారు. గురువారం కార్వేటినగరంలో జరిగిన పశు ఆరోగ్య వైద్యశిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, నట్టల నివారణమ 250 పశువులకు బుటాక్స్ పిచికారి చేశారని తెలిపారు. పశువైద్యాధికారి హేమకుమార్ పాల్గొన్నారు.

ల్యాబ్ మెటీరియల్ వితరణ

యాదమరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్‌కి షేర్ జీసస్ వర్డ్ మినిస్ట్రీస్ ప్రెసిడెంట్ ఎల్.జోసఫ్, గ్లోబెల్ కాంపేషన్ ఐఎస్‌సీ, యుఎస్ఏ వారి సహకారంతో సుమారు రూ.1.52 లక్షల విలువైన సైన్సు ల్యాబ్ మెటీరియల్, రెండు బీరువాలను గురువారం వితరణ చేశారు. జోసఫ్, మేరి దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ప్రిన్సిపాల్ లలిత పాల్గొన్నారు.



కుష్ఠు వ్యాధిపై అవగాహన



చిత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

చిత్తూరు రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాజూరులో గురువారం కుష్ఠువ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కుష్ఠు వ్యాధి నివారణ అధికారి వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సాయి షర్మిల, డీపీఎంవోలు రవికుమార్, జాన్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి సోమశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాల: ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో వైద్యాధికారి సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు జరిగిన ర్యాలీలో వైద్యాధికారి కేఎస్ లోహిత్ చెంగల్రాయన్, సీహెచ్‌సీ డాక్టర్లు శిరీష, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పం: అగ్గిచేనుపల్లెలో పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఉద్యోగులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ అసిస్టెంటు కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: ఆరోగ్య కేంద్రం నుంచి జరిగిన ర్యాలీలో డాక్టర్ దుర్గాదేవి, సీహెచ్‌వో శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యాదమరి: మాదిరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శివకుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పూతలపట్టు: మండల కేంద్రంలో జరిగిన ర్యాలీలో వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ, డాక్టర్ ప్రియాంక, సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి, డాక్టర్ సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.